# ఆ అందం వెనుక...

"కమలా...నువ్వు చాలా అందంగా వుంటావు" అన్నాడు జనార్ధన్–కమలను ఆపాదమస్తకం చూస్తూ.

"ఆ విషయం నాకు తెలుసు" అంది కమల పరిహాసంగా నవ్వి.

తన అందం గురించి కమలకు బాగా తెలుసు. కాలేజీలో చదువుతున్నప్పుడు చాలామంది కుర్రాళ్లు తన అందాన్ని పొగుడుతూ చాలా ప్రేమలేఖలు రాశారు. వాళ్లలో బాగా జుట్టును పెంచుకున్న కవి ఒకడు ఏకంగా తన గురించి విరహగీతాలు రాసి తనకు ఇచ్చాడు చదువుకోమని.

కోలమొహం–విశాలంగా వున్న కళ్లు–తీర్చిదిద్దినట్టున్న కనుబొమలు–సన్నని ముక్కు–చిన్న సున్నాలా వున్న నోరు–పలుచని పెదవులు–శంఖం లాంటి మెడ–గడ్డం కింద చిన్న నొక్కు–నొక్కుల జుత్తు–పొడవాటి జడ–పలుచగా వున్న చెవులకు వేళ్లాడే బంగారు పంజరాలు–అందమైన వొంపులు–పొడుగూ, పొట్టి కాని ఎత్తు–బలంగా పుష్టిగా ఆరోగ్యంగా రబ్బరుబొమ్మలా వుంటుంది కమల. మంచి శరీరఛాయతో కాంతులీనుతూ వుంటుంది.

"నిన్ను చూస్తుంటే నాకు నిన్ను ముద్దుపెట్టుకోవాలని అనిపిస్తుంది" అన్నాడు జనార్ధన్ ముందు గదిలో కిటికీ దగ్గర నిల్చుని లోపలకు చూస్తూ.

"నేను ఎదురుగా లేనప్పుడు నన్ను ముద్దుపెట్టుకోవాలని ఎప్పుడూ అనిపించలేదా?" అనడిగింది కమల నవ్వి.

జనార్ధన్ నీళ్లు నమిలాడు.

కమల ప్రశ్నకు జవాబు చెప్పకుండా "త్వరగా తయారవ్వు–సినిమాకు టైమవుతోంది" అని తొందర చేశాడు.

జనార్ధన్, కమల ప్రేమించుకున్నారు. త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారు. కమల ఒక ప్రయివేటు కంపెనీలో స్టెనోగా ఉద్యోగం చేస్తోంది. జనార్ధన్ ఒక కమర్షియల్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.

"త్వరగా తెములు" అని తొందర చేశాడు జనార్ధన్ చేతికి వున్న వాచీని చూస్తూ.

తిలకంబొట్టు పెట్టుకుని ఎడమచేతికి వాచీ పెట్టుకుని ఒకసారి అద్దంలో తన రూపాన్ని చూసుకుని హేండ్‌బ్యాగ్‌ని భుజానికి తగిలించుకుని "ఇక పద" అంది కమల బయటకు వస్తూ.

ఇంటికి తాళం పెట్టి ఇద్దరూ బయటకు వచ్చారు. కమల ఆ ఇంట్లో ఒంటరిగా వుంటోంది.

వాళ్లు ఆటో కోసం ఎదురుచూస్తున్నప్పుడు నీరెండలో నిలుచున్న కమలను చూస్తూ "కమలా..నిజంగా నువ్వు చాలా అందంగా వుంటావు" అన్నాడు జనార్ధన్.

"ఆ విషయం నాకు తెలుసునని చెప్పానుకదా..పదే పదే ఆ విషయం చెప్పి నన్నెందుకు విసిగిస్తావ్? మన పెళ్లయిన తర్వాత ఈ అందమంతా నీదే కదా" అంది మొహం చిట్లించి.

జనార్ధన్ చిన్నబుచ్చుకున్నాడు.

ఆటో వచ్చింది. ఎక్కారు.

"థియేటర్లో పిచ్చివేషాలు వెయ్యకూడదు" అంది కమల అతనికే వినిపించేటంతటి చిన్నగా.

"ఇంత అందాన్ని పక్కన వుంచుకుని చేతులు ముడుచుకుని కూర్చోటానికి నేను గజేంద్ర ఆస్వాద్‌ని కాదు" అన్నాడు జనార్ధన్ నవ్వుతూ.

"అతనెవరు?" అనడిగింది కమల.

"ఉన్నాడులే నా ఫ్రెండు. ఆడంగోడంటాం"

కమల కిలకిలా నవ్వింది.

◆ ◆ ◆

కమలకీ, జనార్ధన్‌కీ పెళ్లయింది. అది వాళ్ల తొలిరాత్రి.

శోభనం గదిలో పాన్పు మీద పడుకున్నాడు జనార్ధన్. కమల అతని పాదాల దగ్గర కూచుంది.

"ఇప్పుడు ఈ అందమంతా నాదే" అన్నాడు జనార్ధన్.

"కాదని ఎవరన్నారు?" అంది కమల నవ్వి.

ఫ్యాను గాలికి ఆమె తల వెంట్రుకలు ఎగురుతూ గాల్లో నాట్యం చేస్తున్నట్లున్నాయి. తెల్లని దుస్తుల్లో కమల అతనికి ఒక దేవకన్యలా అగుపించి "కమలా..నువ్వు చాలా అందంగా వున్నావు" అన్నాడు జనార్ధన్.

"ఇలా నా అందాన్ని పొగడకపోతే దాన్ని స్వంతం చేసుకోవచ్చును కదా" అంది కమల తల్లో మల్లెపూలు సరిచేసుకుంటూ.

పాన్పు పక్కనే చెక్క బల్ల వుంది. దాని మీద తళతళ లాడుతున్న ఫ్రేములో ఒక అందమైన యువకుడి ఫోటో వుంది. జనార్ధన్ దాన్ని చూసి "ఈ ఫోటో ఎవరిది? మన శోభనం గదిలో వాడి ఫోటో ఎందుకు వుంచావ్? చెప్పు..ఎవడు వాడు?" అడిగాడు కోపంగా.

కమల జవాబు చెప్పకుండా పకపక నవ్వింది.

"నవ్వకు. ఎవడో చెప్పు" అన్నాడతను లేచి కూర్చుంటూ.

అప్పుడు కమల "చెబుతాను. లింగమార్పిడి జరక్కముందు అది నా ఫోటోనే..అప్పుడు నా పేరు కమల్" అంది నవ్వటం ఆపి.

*(సకుటుంబ సపరివార మాసపత్రిక స్వప్న-సెప్టెంబరు 2009)*